## నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక 23 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | జూలై 22, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

**ఆటవెలది**

పరులబాధపెట్టి పరమముదమునొందు
విధము సరియుకాదు విశ్వమందు
మనము బాధపడిన మరొకరి సాయమ్ము
కోరుకున్న వారు కోటి సమము

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.






- కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత
- బలవంతంగా అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు
- రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్

# ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా

**న్యూఢిల్లీ,జూలై 21 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలిం చారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసు లు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షా ల ఎంపీలు పాల్గొ న్నారు. కాంగ్రెస్ మిగతా2లో...

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి



**హైదరాబాద్,జూలై 21 :** బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజర య్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా మిగతా2లో...

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

- సాగు,తాగునీటి సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్,జూలై 21 :** ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ మిగతా2లో...



# సన్న వడ్ల కుంభకోనం గతంలో జరిగిందేమో

- ఈ ప్రభుత్వంలో అలాంటిదేమీ జరగలేదు
- హరీష్ రావు తదితరుల విమర్శలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్

**హైదరాబాద్,జూలై 21 :** ఈ ప్రభుత్వంలో సన్న వడ్ల కుంభకోణం అనేది అవాస్తవమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మీడియా – సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. కొందరు కావాలని సన్న వడ్ల కుంభకోణం అంటూ తప్పుడు ప్రచారం మిగతా2లో...

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

- ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం
- వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి
- కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి



**హన్మకొండ,జూలై 21 :** రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్ధంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మిగతా2లో...

# దేశ యువత కోసం రాహుల్ పోరాటం

- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి పోస్ట్






# ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

**కెకె కమిటీకి నివేదిక అందించిన కవిత**

**హైదరాబాద్,జూలై 21 :** ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి మంగళవారం ఆమె అందజేశారు. అనంతరం ట్యాంక్ బండ సమీపంలోని అమరజ్యోతి వద్ద ఆమె మాట్లాడుతూ.. మిగతా2లో...

# జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

- ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు







# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

- ఎల్‌నినోతో వర్షాభావంపై అధికారులతో చర్చలు
- కార్యాచరణతో ముందుకు
- సాగాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశం

**రంగారెడ్డి,జూలై 21 :** ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున రైతులను పండ్ల తోటలు, అరుతడి పంటల వైపు మళ్లించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో మిగతా2లో...




# కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

- నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా..?
- దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం
- రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్
- మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు

# ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

నేతలు చేతులకుసంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ధి కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

# జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

**హైదరాబాద్,జూలై 21 :** జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తు న్నాయనే ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాట కం ఆడుతోందని బిజెపి దుయ్యబట్టింది. 7వేల ఇళ్లకు 10వేల దరఖాస్తులు వస్తాయి. ఒక్కో దరఖా స్తుకు రూ. 10వేల చొప్పున తీసుకుంటే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్ల రాబడి వస్తుందని, క్యూర్ పేరుతో ప్రజలకు ప్రభుత్వం పెయిన్ తెస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాం పల్లిలో భాజ పా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడారు. క్యూర్‌లో శాస్త్రీయ బద్ధమైన పన్నుల విధానం లేదు. ట్యాక్స్ దోపిడీతో ప్రజలపై భారం పడుతుంది. ఈ చట్టాన్ని రెసిడెన్షియల్ అసోసియేషన్లు వ్యతిరేకిస్తు న్నాయి. ఇది సరైన చట్టం కాదు. ఎవరితోనూ చర్చిం చకుండా దీన్ని అమలు చేస్తున్నారు. రాజీవ్ స్వగృహ పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వాలి. క్యూర్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణ నలోకి తీసుకున్నాకే చట్టాన్ని అమలు చేయా లన్నారు. రూ.వెయ్యి కోట్ల కోసం పేదల నుంచి రూ.10వేలు తీసుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు.

# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తీవ్రత ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులను తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, పండ్ల తోటలు, అరుతడి పంటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌నినో బారిన ప్రజలు పడకుండా చూసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగంపైనే ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలని, అవసరమైన చోట నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమం చివరలో వర్షపు నీటి సంరక్షణ కు సంబందించిన తెలంగాణ జలసిరి పోస్టర్ విడదల చేశారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, కాలే యాదయ్య ఇంకా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివిధ విభగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

**హైదరాబాద్,జూలై 21:** కాళేశ్వ రం దగ్గర చిల్లర రాజకీయం చేయడంపై సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మరి దేవాదుల దగ్గర నీకు ఏం అడ్డమొచ్చిందని ప్రశ్నించారు. దేవాదుల విషయంలో నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ పార్టీది ద్రోహమే అని మండిపడ్డారు. 2011లో మూడేళ్లు దేవాదులను మూలకు పడేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఎగనామం పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. మాట్లాడితే తిట్లు, ఒట్లు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు. మొన్న రాములోరి మీద కూడా ఒట్టు పెట్టిండు అని తెలిపారు. ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టాలని హితవుపలికారు. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. నీళ్లు రాకున్నా.. కరెంటు లేకున్నా రేవంత్ రెడ్డిదే బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి నేటి వరకు సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీరు కిందకు పోయిందని తెలిపారు. నీళ్లన్నీ ఆంధ్రాకు తరలిపోయాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిందని చెప్పారు. నాలుగు రోజులకు ఒక టీఎంసీ ఎత్తవచ్చని.. 50 రోజులకు 12 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. కానీ కనీసం రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదని విమర్శించారు. ఇది నేరపూరిత నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. నీ ప్రభుత్వానికి ఏం శిక్ష వేయాలో నువ్వే చెప్పు అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఇన్ని నీళు ఉంటే ఎత్తవా అని మండిపడ్డారు. ఇదేనా రైతులపై నీకు ఉన్న చిత్తశుద్ధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న దేవాదులను నిర్వహించే సత్తా మీకు లేదా అని అడిగారు. మీ వైఫల్యం వల్ల వరంగల్ జిల్లా వ్యవసాయ సంక్షోభంలో మునిగిపోయిందని అన్నారు.




వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని ఆరోపించారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని.. ప్రతిరోజు పావు టీఎంసీ ఎత్తవచ్చని తెలిపారు. అంటే ఇప్పటికి 12 టీఎంసీలు ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు. మరెందుకు 22 రిజర్వాయర్లు నింపలేదని ప్రశ్నించారు. దేవాదుల నుంచి 105 టీఎంసీలు కిందకు తరలిపోయాయని తెలిపారు. ఈ రోజు కూడా దేవాదులలో 78 మీటర్ల ఎత్తులో నది ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. 73 మీటర్లు ఉంటే చాలు మోటార్లు నడుస్తాయని.. 78 మీటర్లు ఉన్నప్పటికీ మోటార్లు నడిపించడం లేదని చెప్పారు. ఎందుకు నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఏమిటీ నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అతి తక్కువ వర్షపాతం పడిన జిల్లా వరంగల్ జిల్లా అని హరీశ్‌రావు తెలిపారు. రెయిన్‌ఫాల్ తక్కువ ఉంటే సమ్మక్క బ్యారేజీ నుంచి నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎందుకు నీళ్లను కిందకు జారవిడుస్తున్నారని ప్రశ్నించారు. మేం ప్రెస్‌మీట్ పెట్టగానే.. దేవాదులలో రెండు మోటార్లు స్టార్ట్ చేశారని తెలిపారు. మేం ప్రశ్నిస్తే తప్ప నీళ్లు ఎత్తిపోయారా అని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్షంగా రైతుల పక్షాన బాధ్యతాయుత పోరాటం చేస్తున్నామని మండిపడ్డారు.దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు స్టార్ట్ చేసి సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి రైతులు నారుమడులు పోసుకున్నారని తెలిపారు. ఇప్పుడేమో నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ మాత్రం నీళ్లు ఇమ్మని చెబుతున్నాడని అన్నారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని మండిపడ్డారు. ప్రపంచమంతా నీళ్లను కాపాడుకుంటే.. మీరు వృథా చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాకాల ప్రాజెక్టు కింద 29వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి అక్కడి రైతులు నాట్లు వేసుకున్నారని, రామప్ప కింద కూడా నాట్లు వేసుకున్నారని పేర్కొన్నారు. రామప్ప కింద 5500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. నిన్న పాకాల కింద తూములు మూసేశారని పేర్కొన్నారు. నమ్మి నాట్లు వేసుకున్న రైతుల పరిస్థితి ఏంటి అని నిలదీశారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని హరీశ్‌రావు మండిపడ్డారు. రామప్ప కింద తూములు మూసేస్తే రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. నీళ్లు ఎత్తకుండా కలెక్టర్ ఎందుకు తూములు మూసేయమని చెప్పాడని ప్రశ్నించారు. మంత్రులు చెప్పింది తప్పయితే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్రాప్ హాలీడే ప్రకటించి, రైతులకు డబ్బులు ఇవ్వాలన్నారు. పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడతారని హరీశ్‌రావు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి నార్లు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. బిందెలు, సీసాలతో పత్తికి బొట్టు బొట్టు నీళ్లు జల్లుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఉన్న తపన, సోయి రేవంత్ రెడ్డికి లేదా అని మండిపడ్డారు. నీళ్ల కోసం తెలంగాణ రైతులు ఎంతో తపన పడుతున్నారని తెలిపారు. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలు ఎందుకు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నీళ్లు కిందకు విడిచిపెడుతున్నాడని మండిపడ్డారు.

# దేశ యువత కోసం రాహుల్ పోరాటం

**హైదరాబాద్,జూలై 21 :** యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జీకి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలం లోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలనిఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

# ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఈ సందర్భంగా ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది.. అది తప్పని నిరూపించాలని ఆ కమిటీ చైర్మన్‌తో ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాటం చేసి బలైన వ్యక్తిని తానని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంత మేలు జరిగితే తన జన్మ ధన్యమైనట్లేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా కె. కేశవరావును నియమించింది.

# సన్న వడ్ల కుంభకోనం గతంలో జరిగిందేమో

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఈ కుంభకోణం జరిగి ఉండవచ్చని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. ధరలు పెంచి టెండర్ కోడ్ చేస్తే.. ఎవ్వరూ ముందుకు రాలేదని అన్నారు. అందుకే మళ్ళీ పిలిచారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదలలో ఎక్స్‌పర్ట్ అయితే.. హరీశ్‌ను మంత్రి పదవి నుంచి కేసీఆర్ ఎందుకు తొలగించారంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ముందు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావుకు సూచించారు. దేవాదులలో 7 పంపులు నడుస్తున్నాయని.. నేడు మరో రెండు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రూ.14 వందల కోట్ల సంగతి ఏమిటో ముందు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు.

## కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా సంగర్తి రాజన్న నియామకం



ఖానాపూర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ఖానాపూర్ మండల అధ్యక్షునిగా సంగర్తి రాజన్నను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని, ఖానాపూర్ మండలంలోని ఎస్సీ నాయకులందరితో కలసి అభివృద్ధి పనులు చేపడతానని హామీ ఇచ్చారు. పార్టీ ఇచ్చిన ఈ అవకాశాన్ని వృథా కాకుండా ప్రజలకు ఫలితాలు అందేలా కష్టపడతానని రాజన్న స్పష్టం చేశారు.

## డిసిసి జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజుర సత్యం ఆధ్వర్యంలో శుభ్రత పనులు



ఖానాపూర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ పట్టణంలోని 11వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్, డిసిసి జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజుర సత్యం ఆధ్వర్యంలో మంగళవారం శుభ్రత పనులు చేపట్టారు. పిచ్చి మొక్కలు, చెట్లు తొలగింపజేసి, గుంతల మయమైన సిసి రోడ్లను సరిచేశారు. కూలిన డ్రైనేజీల వల్ల ఏర్పడిన గుంతలను మొరం మట్టితో నింపి చదును చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సత్యం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## డిసిసి ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాసమల్ల అశోక్ నియామకం



ఖానాపూర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నిర్మల్ జిల్లా డిసిసి ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా దిలావర్పూర్ గ్రామానికి చెందిన రాసమల్ల అశోక్‌ను నియమించారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కట్ట శ్యామ్ ఆధ్వర్యంలో జిల్లా పూర్తి స్థాయి కమిటీని ప్రకటించారు. ఇందులో అశోక్‌కు ప్రధాన కార్యదర్శి పదవి లభించింది. గతంలో యూత్ కాంగ్రెస్‌లో సోషల్ మీ డియా విభాగంలో పనిచేసిన అశోక్ నియామకంపై దిలావర్పూర్, ఖానాపూర్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## డైరీ చైర్మన్ రాజేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్



కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమెరికా మేరీల్యాండ్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్న కరీంనగర్ డైరీ చైర్మన్ చలిమెడ రాజేశ్వరరావును సప్తగిరి కాలనీలోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఘనంగా సత్కరించారు. గత 40 ఏళ్లుగా కరీంనగర్ డైరీని విజయపథంలో నడిపిస్తూ పాడి పరిశ్రమ అభివృద్ధికి చేసిన విశేష కృషికి గుర్తింపుగానే ఈ డాక్టరేట్ లభించిందని సునీల్ రావు అభినందించారు. వేలాది పాడి రైతులకు భరోసా కల్పిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా డైరీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో రాజేశ్వరరావు పాత్ర ఎనలేనిదని ప్రశంసించారు. డాక్టరేట్ లభించిన సందర్భంగా ఆయన మరింత ఉత్సాహంతో పనిచేసి, కరీంనగర్ డైరీ పేరును దేశవ్యా ప్తంగా మారుమ్రోగేలా కృషి చేయాలని ఆకాంక్షిస్తూ సునీల్ రావు శుభాకాంక్షలు తెలిపారు.

## బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**– కరివేద మహిపాల్ రెడ్డి**



గన్నేరువరం, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్రంలో కమలాన్ని వికసింపజేయడానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గన్నేరువరం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు తిప్పర్తి నీకేష్ అధ్యక్షతన జరిగిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ, శక్తి కేంద్రాలు, బూత్ కమిటీల బలోపేతం వంటి అంశాలను వివరించారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, ఏలేటి చంద్రారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా సభ్యులు మచ్చ బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శులు బొమ్మాడి సురేందర్ రెడ్డి, పుల్లెల రాము, మండల కార్యదర్శి చెక్కిళ్ల చంద్రయ్య, కోశాధికారి బద్దం అనంతరెడ్డి, వార్డు సభ్యులు మచ్చ సాయికృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడిగా గర్షకుర్తి లక్ష్మణ్ ఎన్నిక



గన్నేరువరం, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గన్నేరువరం నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఎన్నికల్లో గర్షకుర్తి లక్ష్మణ్ అధ్యక్షుడిగా, మిడిదొడ్డి అనిల్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు నీలం మొం దయ్య ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఎన్నికల సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల సంపత్, గౌరవ అధ్యక్షుడు ఔదుర్తి లక్ష్మణ్ కుమార్, ఉపాధ్యక్షుడు గడ్డం వెంకటేశం, ప్రచార కార్యదర్శి మిడిదొడ్డి రవీందర్, మాజీ గౌరవ అధ్యక్షులు నాగవెల్లి లక్ష్మిరాజం, గర్షకుర్తి బాలయ్య, సమ్మెట అనిల్ తదితరులు హాజరయ్యారు.

# ప్రశ్నిస్తే లాఠీచార్జీనా? విద్యార్థుల గొంతు నొక్కేయాలనుకుంటున్నారా?

**– ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జీని ఖండిస్తూ అచ్చంపేటలో ఏఐఎస్ ఎఫ్ నిరసన సమావేశం**




అచ్చంపేట, జూలై 21(నీలగిరి ఎక్స్ ప్రెస్): ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి, యువజన సంఘాలపై పోలీసులు జరిపిన లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తూ, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలోని ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిరసన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్‌ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలుముల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, ప్రశ్నించే విద్యార్థులపై ప్రభుత్వం పోలీసు బలగాలను ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం, లాఠీచార్జీలతో ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు.

దేశంలో 2014 నుండి ఇప్పటి వరకు సుమారు 152 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొంటూ, వరుస పేపర్ లీకేజీలు దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుని, ఎన్నో ఆశలతో పరీక్షలకు హాజరవుతుంటే, ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 2026 నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఘటనగా పేర్కొంటూ, పరీక్షల పారదర్శకతను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో విద్యార్థి, యువజన సంఘాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ నుండి పార్లమెంట్ వైపు శాంతియుతంగా చేపట్టిన నిరసన ప్రదర్శనను పోలీసులు అడ్డుకొని లాఠీచార్జీ చేయడం, పలువురు విద్యార్థి నాయకులను గాయపరచడం, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని అన్నారు. ప్రశ్నించే ప్రతి గొంతును బలవంతంగా అణచివేయాలని ప్రయత్నించడం దేశ భవిష్యత్తుకు ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, "గాయాలు శరీరానికే... సంకల్పానికి కాదు. లాఠీలతో ఉద్యమాలను ఆపలేరు. విద్య హక్కు కోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏఐఎస్‌ఎఫ్ పోరాటం నిరంతరం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, ప్రశ్నలకు సమాధానం లాఠీచార్జీ కాదని, పేపర్ లీకేజీలపై సమగ్ర దర్యా ప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా సమితి సభ్యులు మధు, ఫన్నీ, అర్జున్, చరణ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవించాలి

**– రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



కల్వకుర్తి, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవించడంతో పాటు సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు అష్టైశ్వర్యాలతో జీవించాలని సంకల్పంతో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్ర 91వ విశ్వశాంతి మహాయాగం ఎంతో గొప్పదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ మైదానంలో జరుగుతున్న ఆయుత చండీ అతి రుద్ర మహాయాగంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజ సంభ ఆవిష్కరణలో పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ప్రపంచ మానవాళి సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ యాగం నిర్వహించడం గొప్ప విషయం. ప్రస్తుతం వర్షాభావంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ యాగం ఫలించి సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండించి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ కృష్ణ చైతన్య పరిశుద్ధానంద స్వామి మాట్లాడుతూ, యాగఫలం అందరికీ అందుతుందని, ఆగస్టు 3 వరకు యాగ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమాల్లో శ్రీ ఆంజనేయ మన్యు పాశుపత హోమాలు, చండీ హోమం, గ్రహ హోమం ప్రత్యేకంగా నిర్వహించగా, సాయంత్రం అభయాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన, సింధూర అర్చన భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం నుండి సాయంత్రం వరకు హనుమాన్ చాలీసా పారాయణం, భగవద్గీత పారాయణం నిర్వహించగా, రాత్రి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహాయాగంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు, బీచని బాలకృష్ణ, పోలా సురేందర్, జూలూరు ప్రకాష్, రాజేందర్, కల్మిచర్ల గోపాల్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దాదాపు 1500 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు.

# కల్వకుర్తిలో ఆధ్యాత్మిక శోభ విశ్వశాంతి మహాయాగంలో యాగ ప్రతిష్ఠ



కల్వకుర్తి, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవించాలని సంకల్పిస్తూ కల్వకుర్తిలో జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్ర 91వ విశ్వశాంతి మహాయాగం రెండవ రోజు ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఉదయం శివుని పూజా కార్యక్రమాలు నిర్వహించగా, గోపూజ మహోత్సవం సందర్భంగా గోవులకు పూజలు చేసి యాగశాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. వేదమంత్రాల ఘోషతో యాగశాల ప్రవేశం ఆధ్యాత్మిక వాతావరణాన్ని అలరించింది. పండితులు వేదపఠనం చేస్తూ హోమాలను ముందుకు నడిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక శోభను ఆస్వాదించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి రుత్వికులను సమానంగా చేస్తూ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ, "ఆగస్టు 3 వరకు జరిగే హోమాలు, పూజా కార్యక్రమాలలో భక్తులందరూ పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలి" అని సూచించారు. ప్రతినిత్యం ఉదయం 6 గంటల నుండి రాత్రి వరకు ఆయుత చండి, అతి రుద్రం, ఋగ్వేద--యజుర్వేద--సామవేద--అధర్వణ వేద ఘోష హవనాలు, నవగ్రహ హోమం, నక్షత్రయాగం, శ్రీ సుదర్శన హవనం, సూర్య హోమం, సూర్య నమస్కారాలు, పాశుపతాస్త్ర హోమం, సుబ్రహ్మణ్య హోమం, పుత్రకామేష్టి హోమం, ధన్వంతరి హవనం, లక్ష్మీ గణపతి హోమం, మహాగణపతి హోమం, అష్టలక్ష్మి హోమం, లక్ష్మీనారాయణ హోమం, హనుమత్ హోమం, సరస్వతి హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ మహాయాగంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరు రమేష్ బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, యాగ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కార్యకర్తకు నేనున్నాననే భరోసా ఇచ్చిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



కల్వకుర్తి, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నియోజకవర్గంలో కార్యకర్తలకు ఆపద సమయంలో నేనున్నానని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. "ఆపద కాలంలో అధైర్యపడకండి, అండగా నేనుంటాను" అని ఆయన హామీ ఇచ్చారు. కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త భూషపాకుల రామకృష్ణ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గోలి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. రామకృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు. అవసరమైన ప్రతి విషయంలో అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు వట్టెపు బాలయ్య, సింగం విజయ్ గౌడ్, మాజీ ఎంపీపీ పుట్ట రామిరెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు నాగులు నాయక్, మార్చర్ల సర్పంచ్ కృష్ణ రెడ్డి, వెల్దండ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, తలకొండపల్లి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు కిషోర్, పాండు, నరేష్, రమేష్, ప్రవీణ్, గణేష్, బాలరాజ్, తిరుపతి రెడ్డి, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకం

**– కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**



ఆమనగల్లు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు వస్పుల మానయ్య, సర్పంచ్ మండ్లి రాములు, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, బలహీన వర్గాల అభ్యున్నతే మల్లికార్జున ఖర్గే రాజకీయ జీవితానికి మూల సూత్రాలని అన్నారు. ఖర్గే చూపిన మార్గంలో నడుస్తూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యమని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మల్లికార్జున ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరెన్నో సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత విజయ్, ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్, సీనియర్ నాయకులు తెల్గమల్ల జగన్, కృష్ణ నాయక్, అప్పం శ్రీను, కాలే మల్లయ్య, గాజుల శ్రీను, సీత పెద్దయ్య, ఖాదర్ ఖాద్రి, గాజుల సురేష్, ఎంగలి ప్రసాద్, అబ్దుల్ అలీమ్, కొండల్ రెడ్డి, షర్ఫుద్దీన్, దేవరశెట్టి మహేష్, కిషన్ నాయక్, దుడ్డు కృష్ణ యాదవ్, రాజు, నాజర్, రఫీ, లోక్య నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా భద్రతే లక్ష్యం సీపీ గౌష్ ఆలం



హుజురాబాద్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఇల్లందకుంట మండలంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించి, నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. వనమహోత్సవంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. విద్యార్థులకు పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లు ముద్రించిన ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణీ చేసి, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు అందజేసి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు, జూదం, సైబర్ మోసాలు వంటి అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ నిర్వహించి, పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని అధికారులకు ఆదేశించారు. ప్రతిపాదిత పోలీస్ స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, త్వరితగతిన పనులు ప్రారంభించాలని సూచించారు. తదుపరి జమ్మికుంట రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు, కార్యాలయ నిర్వహణను సమీక్షించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, వెంకట్, ఎస్సై క్రాంతికుమార్, పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూభారతి రీసర్వే నిర్వహణకై గ్రామసభ ఏర్పాటు



హుజురాబాద్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఇల్లంతకుంట మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో భూభారతి రీసర్వే నిర్వహణ కోసం గ్రామసభ జరిగింది. ఈ సమావేశానికి అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో జల కుమారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తేజస్విని, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కిషన్ రావు, తహశీల్దార్ మనోజ్ కుమార్, ఎంపీడీవో వెంకటరత్నం, డిప్యూటీ ఇన్స్పెక్టర్ రంజిత్ రెడ్డి, గిర్ధవార్ సత్యనారాయణ, సర్వేయర్ తదితరులు హాజరయ్యారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సహకారంతో సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్ రావు గ్రామస్తుల భూములను కొలిచి, సంబంధిత నక్షంటాలను అందజేస్తామని పేర్కొన్నారు. గ్రామస్థుల సహకారంతో రీసర్వే విజయవంతం అవుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగరంలోని 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో రూ.19 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సౌకర్యాలు, అవసరమైన అన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వరాల నర్సింగం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపల్ అధికారులు, వికలాంగుల సంఘ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సఫాయి అప్నావో భీమారీ భగావో కార్యక్రమం నిర్వహణ



హుస్నాబాద్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ పట్టణంలోని 3వ వార్డులో పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో సఫాయి అప్నావో -- భీమారీ భగావో కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ కొండ రజితతో పాటు మున్సిపల్ సభ్యులు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ నిల్వ నీటిని తొలగించడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని, చెత్తను తడి--పొడి వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బూరుగు లత, పిల్లి తిరుపతి, పూదరి వరప్రసాద్, కో-ఆప్షన్ సభ్యుడు ఎండి. హసన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రవికుమార్, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి వివేక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



మానకొండూర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హైదరాబాద్ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కార్మిక, ఉపాధి, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజ కవర్గానికి సంబంధించిన అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలు, కార్మికుల ఉపాధి అవకా శాలపై సుదీర్ఘంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సమస్యల పరిష్కా రానికి అవసరమైన చర్యలు తీసుకుం టామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# జిల్లా ఆటో జేఏసీ కన్వీనర్‌గా ఎనగందుల నాంపల్లి నియామకం




సుల్తానాబాద్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సీనియర్ ఆటో డ్రైవర్ ఎనగందుల నాంపల్లిని పెద్దపల్లి జిల్లా ఆటో జేఏసీ కన్వీనర్‌గా రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి రాజు ప్రకటించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఆటో యూనియన్ సమావేశంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం, సంక్షేమం, సంఘ బలోపేతం కోసం ఈ బాధ్యతలు అప్పగించినట్లు రాష్ట్ర నాయకత్వం పేర్కొంది. ఎనగందుల నాంపల్లి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆటో డ్రైవర్ల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు, మండలాల ఆటో డ్రైవర్లు, సంఘ సభ్యులు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు.

## బీఎల్‌ఏ-2లకు ఎన్నికల నిర్వహణలో వారి బాధ్యతలపై అవగాహన సదస్సు



సుల్తానాబాద్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బీజేపీ రాష్ట్ర, జిల్లా శాఖ పిలుపు మేరకు ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 17 బూత్‌లకు నియమితులైన బీఎల్‌ఏ-2ల సమావేశం మంగళవారం ఎస్ఆర్ గార్డెన్‌లో జరిగింది. పట్టణ బీజేపీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి మున్సిపాలిటీ ఇన్‌చార్జి, జిల్లా ఉపాధ్యక్షుడు సౌదరి మహేందర్ యాదవ్, బీఎల్‌ఏ-1 బెజ్జంకి దిలీప్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎల్‌ఏ-2లకు ఎన్నికల నిర్వహణలో వారి బాధ్యతలు, ఓటరు జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి బూత్ స్థాయిలో సమర్థవంతంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో లంక శంకర్, కందనూరి కుమార్, ఎల్లంకి రాజన్న, ఏగోలపు సదయ్య, ఎలువేని తిరుపతి, భూసారపు సంపత్, నూనె మహేష్, బండారి లత, వలస సాయికిరణ్, బుర్ర సతీష్, కొయ్యడ శ్రీకాంత్, బత్తుల చంద్రశేఖర్, పోచంపల్లి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



సుల్తానాబాద్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల కాలనీలో 13వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్ సిద్ధ తిరుపతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో బురద, నీరు నిల్వ ఉండడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రత్యేక చొరవతో మున్సిపల్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సీసీ రోడ్డు పూర్తయిన అనంతరం వర్షపు నీరు నిల్వ సమస్య తగ్గి, స్థానికులు, విద్యార్థులు, వృద్ధులు సౌకర్యవంతంగా రాకపోకలు సాగించగలరని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొని అభివృద్ధి పనులు ప్రారంభమైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, కౌన్సిలర్ సిద్ధ తిరుపతికి కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు ఉచిత కుట్టు శిక్షణ



కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మహిళల సాధికారతే సమాజాభివృద్ధికి పునాది అని, వారు ఆర్థికంగా స్వావలంబులుగా ఎదగడమే లక్ష్యంగా ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్ 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ ప్రజాసేవ కార్యాలయంలో మహిళలతో సమావేశమై శిక్షణ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు టైలరింగ్‌లో నైపుణ్యాలు పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చని, కుటుంబాలకు ఆర్థిక చేయూతనిస్తూ సొంత కాళ్లపై నిలబడే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. స్థానిక మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బాల చంద్ర, అరుణ, శోభనలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కరివేపాకు మాలలతో దుర్గాభవానీ అమ్మవారి అలంకరణ



కరీంనగర్ రూరల్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆషాడమాస శాకంబరీ ఉత్సవాల భాగంగా కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో అమ్మవారిని కరివేపాకు మాలలతో అలంకరించారు. మంగళవారం ఏడవ రోజు సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారి దర్శనం పొందారు.

# రోడ్డు విస్తరణ పనుల పునఃప్రారంభానికి కలెక్టర్ భవేష్ మిశ్రాకు వినతి



ఖానాపూర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ పట్టణంలో ప్రధాన రహదారి డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులను పునఃప్రారంభించాలని మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్, కౌన్సిలర్లు మంగళవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గతంలో ప్రారంభమైన పనులు కోర్టు స్టే కారణంగా నిలిచిపోయి, ఇప్పటివరకు పూర్తి కాలేదని, దీంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగి ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. పనులను తిరిగి ప్రారంభించి పట్టణానికి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే బస్టాండ్ నుండి శ్రీరామ్ నగర్ గోదావరి తీరం వరకు కొత్త రహదారి, సదర్మాట్ కెనాల్ పై కొత్త బ్రిడ్జి మంజూరు చేయాలని, భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొప్పరపు సత్యవతి, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ నర్సరీలలో మొక్కల కొరతపై డిప్యూటీ మేయర్ ఆగ్రహం



కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని నర్సరీల నిర్వహణపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం డ్యామ్ వద్ద ఉన్న మున్సిపల్ నర్సరీని పరిశీలించిన ఆయన, గతంలో పచ్చదనంతో కళకళలాడిన నర్సరీలు ఇప్పుడు నిర్లక్ష్యంతో వెలవెలబోతున్నాయని అన్నారు. వర్షాకాలంలో ప్రజలకు పూల, పండ్ల మొక్కలు పంపిణీ చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అధికారులు ముందస్తు సన్నాహాలు చేయలేదని విమర్శించారు. నర్సరీల్లో మొక్కల కొరత స్పష్టంగా కనిపిస్తోందని, తక్షణ చర్యలు తీసుకుని గత వైభవాన్ని తిరిగి తీసుకురావాలని ఆయన మున్సిపల్ అధికారులను ఆదేశించారు. త్వరలోనే మేయర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి, ప్రజలకు తగినన్ని మొక్కలు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో ఇకపై అలసత్వం వహించినా ఉపేక్షించబోమని సునీల్ రావు స్పష్టం చేశారు.

## తపస్ చలో హైదరాబాద్ మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తపస్ రాష్ట్ర శాఖ చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆగస్టు 1న జరిగే తపస్ చలో హైదరాబాద్ మహా ధర్నా పోస్టర్‌ను కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి జారతి నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్సి ప్రకటించాలని, పెండింగ్ డి.ఏలు విడుదల చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయులకు తగిన వేతనాలు, టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మండల బాధ్యులు, ఉపాధ్యాయులు రాచకొండ పవన్ కుమార్, రంగోజు శ్రీనివాస్, జి.కృష్ణమూర్తి, ఎ.శ్రీనివాస్, కే.లక్ష్మణ్, ఓరుగంటి తిరుపతి, పి.లక్ష్మణ్ కుమార్, కిషన్ రెడ్డి, అపర్ణ, మంజుల, నాగలక్ష్మి, విమల, కవిత, మౌనిక, లలిత తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్




కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): విద్యార్థులపై లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఢిల్లీలో శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఎన్‌టిఏను వెంటనే రద్దు చేయాలని, విద్యార్థుల సమస్యలపై స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. 21 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షులు వినయ్, ఇసాక్, సహాయ కార్యదర్శి గట్టు ఆకాశ్, గర్ల్స్ కన్వీనర్ మానస, కమిటీ సభ్యులు రోహిత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల నియామక దరఖాస్తులకు ఆహ్వానం




కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కరీంనగర్‌లో 2026--27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి తెలిపారు. అప్లైడ్ న్యూట్రిషన్, బి.కాం. బి.ఎఫ్.ఎస్.ఐ., బోటనీ, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లీష్, హెల్త్ కేర్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, స్టాటిస్టిక్స్, తెలుగు, జంతుశాస్త్రం వంటి విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, పి.హెచ్.డి./నెట్/సెట్ అర్హత లేదా బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 22 సాయంత్రం 4 గంటలలోగా దరఖాస్తులు సమర్పించాలని, జూలై 23 ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని సూచించారు.

# 100 శాతం ఎస్ఐఆర్ పూర్తి చేసిన సర్పంచికి ఎమ్మెల్యే ఘన సన్మానం



గంగాధర, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని రంగారావుపల్లి గ్రామంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసిన సందర్భంగా సర్పంచి దాసరి శంకరయ్యను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్, ఎంపీడీవో, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సన్మానం చేసినందుకు సర్పంచి దాసరి శంకరయ్య ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా సఫాయి అప్నావో బీమారీ భగావో పోస్టర్ ఆవిష్కరణ



కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణ లక్ష్యంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి "సఫాయి అప్నావో బీమారీ భగావో" పోస్టర్‌ను ఆవిష్కరించారు. జూలై 31 వరకు నగరవ్యాప్తంగా చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రత, దోమల నివారణ చర్యలు, పాఠశాలలు, మార్కెట్లు, స్లమ్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కరీంనగర్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఆయాజ్, సువార్త, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, డీఈ లచ్చిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# రైతు సదస్సుకు పెద్ద ఎత్తున తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



పెద్దపల్లి, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు (కేటీఆర్) మంచిర్యాల్ నియోజకవర్గంలోని లక్షేపేటలో నిర్వహిస్తున్న రైతు సదస్సుకు పెద్దపల్లి నియోజకవర్గం నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ తరలింపులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ బలంగా వినిపిస్తోందని తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేటీఆర్ సదస్సులో దిశానిర్దేశం చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన చిరుత మంగ రమేష్



గంగాధర, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు చిరుత మంగ రమేష్ మండలంలోని ఎమ్మార్వో అంబటి రజిత, ఎంపీడీవో దమ్మని రాము, ఎస్సై వంశికృష్ణలను మర్యాదపూర్వకంగా కలిసి సాల్వాలతో సన్మానించారు. అలాగే ఇటీవల చొప్పదండి సింగిల్ విండో చైర్మన్‌గా నియమితులైన ఇప్ప శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మండల అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, మండల ప్రజల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి మహేందర్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జూలై 20వ తేదీని కిరాతక దినంగా ప్రకటించాలని బీఎస్పీ డిమాండ్




హుస్నాబాద్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నీట్ పరీక్షలో అవకతవకలు, విద్యార్థుల ఆత్మహత్యలు, ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల దాడులపై బీఎస్పీ తీవ్రంగా స్పందించింది. కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజిత్ దుల్కే పిలుపు మేరకు లక్షలాది మంది యువత ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మరణించిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనకారులపై పోలీసులు టియర్ గ్యాస్, లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిరంకుశంగా ప్రవర్తిస్తోందని విమర్శిస్తూ, జూలై 20వ తేదీని కిరాతక దినంగా ప్రకటించాలని బీఎస్పీ పార్టీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ఎలగందుల శంకర్, వేల్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం నీళ్లు కరీంనగర్‌కు రాలేదని ఎమ్మెల్యే విజయ రమణారావు విమర్శలు



కాల్వ శ్రీరాంపూర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని మెదక్, గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలకే పరిమితం చేసి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు అందించలేదని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు విమర్శించారు. మంగళవారం మల్యాల, తారుపల్లి, మీర్జాంపేట, కాల్వ శ్రీరాంపూర్ గ్రామాల్లో రూ.5 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సభలో మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో సాగు నీరు ఇప్పటికీ ఎస్సారెస్పీ ద్వారానే అందుతోందని, కాళేశ్వరం సమస్యలకు గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని అన్నారు. అవసరమైతే ప్రాజెక్టును మరమ్మతులు చేయడం లేదా పునర్నిర్మాణం చేపడతామని, తుమ్మిడిహట్టి ద్వారా నీటిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగును తగ్గించి కంది, నువ్వులు, వేరుశనగ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. రాష్ట్రంలో 24 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, డీఏపీకి ప్రత్యామ్నాయంగా సూపర్, నానో ఎరువులను వినియోగించాలని సూచించారు. గత ప్రభుత్వం 30 పడకల ఆస్పత్రిని 6 పడకలకు కుదించిందని విమర్శించిన ఆయన, మళ్లీ 30 పడకల ఆస్పత్రిని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. పెద్దరాతపల్లి గ్రామంలో హుజూరాబాద్--జమ్మికుంట--గోదావరిఖని మార్గంలో కొత్త ఆర్టీసీ బస్సు సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు

# రాష్ట్ర మంత్రి హోదా



సుల్తానాబాద్/పెద్దపల్లి, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావుకు రాష్ట్ర మంత్రి హోదా కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి. నెం.1064ను జారీ చేసింది. ప్రభుత్వ విప్‌లుగా కొనసాగుతున్న విజయ రమణారావు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశంలకు రాష్ట్ర మంత్రి హోదా, ప్రోటోకాల్, మర్యాదలు వర్తించనున్నాయి. పెద్దపల్లి ఎమ్మెల్యేకు రాష్ట్ర మంత్రి హోదా లభించడంతో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లాకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర మంత్రి హోదా లభించడం ద్వారా జిల్లాకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని, అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆషాఢ తొలి మంగళవారం శాఖంబారి దేవిగా వాసవి మాత దర్శనం



షాద్‌నగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆషాఢ మాసం తొలి మంగళవారం సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని శాఖంబారి దేవి అవతారంలో అత్యంత వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాసు పంతులు వేదమంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖంబారి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవి మాతను దర్శించుకునేందుకు మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి పూలు, పండ్లు, కూరగాయలతో విశేష అలంకరణ చేయడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. భక్తులు ప్రత్యేక అర్చనలు నిర్వహించి కుటుంబాల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కోసం ప్రార్థనలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైశ్య సంఘ ప్రతినిధులు, మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# మార్నింగ్ వాక్‌లోనే డ్రైనేజీ సమస్యకు చెక్

– చైర్మన్ పత్య నాయక్



ఆమనగల్లు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తున్న ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ మార్నింగ్ వాక్‌లోనే డ్రైనేజీ సమస్యను గుర్తించి తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. సోమవారం కురిసిన వర్షాలకు నీటితో నిండిపోయిన డ్రైనేజీని మంగళవారం ఉదయం పరిశీలించిన ఆయన, వెంటనే మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి శుభ్రపరిచే పనులు చేపట్టించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త, మురుగును పూర్తిగా తొలగించి వర్షపు నీరు ఎలాంటి అంతరాయం లేకుండా సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి వార్డులో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు కూడా చెత్తను డ్రైనేజీల్లో వేయకుండా మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ ఉండదని చైర్మన్ పత్య నాయక్ స్పష్టం చేశారు.

# నేడు స్వాతి నక్షత్ర గిరిప్రదక్షిణ



యాదగిరిగుట్ట, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కోట్లాది వంది కొంగుబంగారమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మనక్షత్రం స్వాతి. ఈ నెలలో బుధవారం వచ్చిన స్వాతి నక్షత్రం సందర్భంగా గిరిప్రదక్షిణ నిర్వహణకు ప్రత్యేక శోభ ఏర్పడింది. ఉదయం 6 గంటలకు కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద శ్రీ స్వామివారి పాదాల చెంత ప్రత్యేక పూజలతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం భక్తులు కీర్తనలు, పాటలు, నామస్మరణతో భజన చేస్తూ కొండ చుట్టూ గిరిప్రదక్షిణ కొనసాగించారు. వైకుంఠ ద్వారం వద్ద ప్రారంభమైన ప్రదక్షిణ తిరిగి అదే స్థలానికి చేరుకొని, ఆ తర్వాత కొండపైకి వెళ్లి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. "గిరిప్రదక్షిణ చేస్తే కష్టాలు గట్టెక్కుతాయి, కోరికలు తీరుతాయి, సకల శుభాలు కలుగుతాయి" అనే విశ్వాసంతో రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు యాదగిరిగుట్టకు తరలివచ్చారు. ఇటీవల కాలంలో ఈ గిరిప్రదక్షిణకు విశేష ప్రాచుర్యం లభించడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగింది.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలి



కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అధికారులను ఆదేశించారు. ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రవాణా, పోలీస్, నేషనల్ హైవే అధికారులు సమన్వయంతో రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రైట్ ఆఫ్ వే మార్గంలో కొత్త వాణిజ్య నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, పార్కింగ్ నియంత్రణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద హైమాస్ట్ లైటింగ్, కెమెరాలు, హెచ్చరిక సంకేతాలు ఏర్పాటు చేయాలని, భారీ వాహన డ్రైవర్లకు విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ వైద్య సహాయం అందించేందుకు సమీప ఆసుపత్రులను మ్యాపింగ్ చేసి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా రహదారి భద్రతా టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు.

# నీట్ పేపర్ లీకేజీపై సిపిఐ తీవ్ర విమర్శలు




కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తీవ్రంగా స్పందించారు. కరీంనగర్ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, లీకేజీ వల్ల లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు దెబ్బతిన్నాయని, బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నిరసనపై ఢిల్లీలో పోలీసులు లాఠీచార్జ్ చేసి, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నిస్తే మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు. అలాగే తెలంగాణలో సాగు, త్రాగునీటి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గోదావరి జలాలను మెట్టప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక చొరవ అవసరమని, ఎల్లంపల్లి, మిడ్ మానేరు నుండి దిగువ మానేరు జలాశయానికి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా నాయకులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మీ, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, కొట్టె అంజలి, బాకం ఆంజనేయులు, కసిబోజుల సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జీని ఖండిస్తున్న ఏఐఎస్ఎఫ్



కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నీట్ పేపర్ లీకేజీపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై ఢిల్లీలో పోలీసులు లాఠీచార్జీ చేయడం అమానుషమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ తీవ్రంగా ఖండించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళా విద్యార్థులపై అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సింది పోయి బలప్రయోగానికి దిగడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు. గాయపడిన విద్యార్థులకు తక్షణ వైద్య సహాయం అందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి తరఫున డిమాండ్ చేశారు.

# ఉద్యమకారుల కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించిన అబ్దుల్ మన్నన్



పెద్దపల్లి, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఉద్యమకారులకు 250 గజాల స్థలం, 25 వేల రూపాయల పెన్షన్, కోటి రూపాయల ఫ్యామిలీ పెన్షన్, ఉచిత బస్సు పాస్, పిల్లలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ మన్నన్, తెలంగాణ రాష్ట్ర ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ మోబిన్ హైదరాబాద్ సెక్రటేరియట్‌లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



పెద్దపల్లి, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూ నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని, విద్యార్థులపై ఢిల్లీలో పోలీసులు చేసిన లాఠీచార్జ్ ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తీవ్రంగా ఖండించారు. గాయపడిన విద్యార్థులకు తక్షణ వైద్యం అందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఏ ద్వారా పరీక్షలు నిర్వహించడం వల్ల సమస్యలు పెరుగుతున్నాయని, దానిని రద్దు చేసి రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వాలని కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మామిడిపల్లి అరవింద్, నాయకులు బాలాజీ, నరేష్, ప్రణయ్, రఘు, రాజ్ కుమార్, నవీన్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు



**కరీంనగర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో బోనాల పండుగను అట్టహాసంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడుతూ బోనాలు తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకగా, రాష్ట్ర పండుగగా ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. బోనం అంటే భోజనం, దానిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించడం ద్వారా సమాజంలో శాంతి, సుఖసంతోషాలు నెలకొంటాయని గుర్తు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా నరేందర్ రెడ్డికి మూధం అందజేసి ప్రత్యేక నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లిఖార్జున్ ఖర్గే 84వ జన్మదిన వేడుకలు



**ఖానాపూర్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే 84వ జన్మదిన వేడుకలు ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి.నిర్మల్ డిసిసి అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడుమా బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖర్గే ప్రజల పక్షాన పోరాడుతున్న నాయకుడని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దేశంలో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంకల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## బ్రహ్మగిరి గ్రామంలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ కార్యక్రమం

**– పలు కార్యాలయాల ఆకస్మిక తనిఖీ**



**అమ్రాబాద్, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మంగళవారం బ్రహ్మగిరి--దోమలపెంట గ్రామంలో నిర్వహించిన మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిస్థితులను పరిశీలించారు. గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని అధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే విద్యాశాఖ అధికారులతో మాట్లాడి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. అభివృద్ధి పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, విద్యా మరియు వైద్య సేవల మెరుగుదల ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాంతియుత నిరసనలపై పోలీసు చర్యలు సరికాదు

**– ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్**



**ఆమనగల్లు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపడుతున్న విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో తమ సమస్యలను శాంతియుతంగా వ్యక్తపరచుకునే హక్కు ప్రతి పౌరుడికీ, ముఖ్యంగా విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిందన్నారు. అలాంటి విద్యార్థులపై పోలీసు చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసే చర్యలని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను అణచివేసే విధానాన్ని విడనాడి, వారి డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో జరిగే ఆందోళనలను గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని, విద్యార్థుల హక్కులను పరిరక్షించే దిశగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ఫరీద్ పేర్కొన్నారు.

## కరుణించిన వరుణుడు సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి పూజా ఫలితం!



**కల్వకుర్తి, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, వరుణ దేవుడు కరుణించాలని గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన పడకల్ గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి సంకల్పం ఫలించింది. తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో ఇటీవల సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, రైతులు కలిసి వరదపాశం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు ఎండిపోకుండా కాపాడాలని ప్రార్థనలు చేశారు. ఈ పూజల అనంతరం వరుణుడు కరుణించడంతో గ్రామంలో వర్షాలు కురిశాయి.రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. పంటలు ఎండిపోకుండా కాపాడిన వరుణుడి కరుణకు కృతజ్ఞతలు తెలుపుతూ, సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులు తమ సంకల్పం నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు.

# ఖర్గే జన్మదినం.. సేవా కార్యక్రమాలతో కాంగ్రెస్ సంబరాలు



**ఆమనగల్లు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకుని కడ్తాల్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుగంటి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాధారణ కాంగ్రెస్ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన మల్లికార్జున ఖర్గే తన కృషి, అంకితభావంతో ఎమ్మెల్యే, మంత్రి, కేంద్ర మంత్రి, ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడిగా దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలు, రైతులు, కార్మికులు, యువత, మహిళల సంక్షేమంతో పాటు రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్గే మార్గదర్శకత్వం ప్రేరణగా నిలుస్తోందన్నారు. ఆయన సుదీర్ఘ ఆయురారోగ్యాలతో మరింతకాలం ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, అమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నర్సింహ, డీసీసీ ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చెగురి వెంకటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, పట్టణ అధ్యక్షుడు మాలే మల్లేష్, ఉప సర్పంచ్ యాదగిరి రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్‌తో పాటు ఇమ్రాన్, సత్యం యాదవ్, జహంగీర్ అలీ, జాంగీర్ బాబా, పిప్పళ్ల యాదయ్య, రామచందర్ నాయక్, చెందోజి, లక్ష్మణ్ నాయక్, భరత్ యాదవ్, శ్రీశైలం, చంద్రయ్య, కుమార్, సత్తయ్య, కాశయ్య తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల క్షేమం కోసం.. ఆంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి దంపతులు



**ఆమనగల్లు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి గారు తమ సతీమణి శ్రీమతి మాధవితో కలిసి మంగళవారం తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రసిద్ధ శ్రీ బండ్ల ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, నియోజకవర్గ ప్రజల ఆయురారోగ్యాలు, అభివృద్ధి కోసం ప్రార్థించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల, ఆమనగల్ మండలాలతో పాటు ఆమనగల్ పట్టణానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి దర్శనం అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని శ్రీ బండ్ల ఆంజనేయస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తి, సేవాభావం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత ఘనంగా జరిగింది. వేడుకల్లో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సింగల్ విండో కేశవ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డైరెక్టర్ అంజయ్య గుప్తా, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ రామలక్ష్మణ్, భూపతి రెడ్డి, డేవిడ్, రాజందర్ నాయక్, ఫరీద్, ఖాదర్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వేదికపై గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డికి గౌరవ ఆహ్వానం




**ఆమనగల్లు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తున్న కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డికి అమెరికా తెలుగు అసోసియేషన్ (ఏటీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏటీఏ--2026 మహాసభలకు ప్రత్యేక ఆహ్వానం అందింది. జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు అమెరికాలోని మెరిలాండ్ రాష్ట్రం బాల్టిమోర్ నగరంలో జరగనున్న 19వ అమెరికా తెలుగు యూత్ కన్వెన్షన్‌కు ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సభ్యుడు కిషోర్ గూడూరు ఆహ్వానం అందజేశారు. గతంలో ఆటా--2020 వేడుకలకు ప్రీమియర్ స్పాన్సర్‌గా వ్యవహరించిన లక్ష్మీ నర్సింహా రెడ్డి, అమెరికా తెలుగు సంఘం ప్రతినిధి కిషోర్ గూడూరు సహకారంతో కడ్తాల్ మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. 2019, 2021, 2023, 2025 సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, తాగునీటి సౌకర్యాలు, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడంతో పాటు కరోనా సమయంలో సహాయక కిట్లు, నిరుపేదలకు వృత్తిపరమైన పనిముట్లు, పోలీసు శాఖకు వేగ నియంత్రికలు అందజేశారు. అలాగే "నవత--యువత--భవిత" నినాదంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ సామాజిక సేవలో తనదైన ముద్ర వేశారు. తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించినందుకు గుర్తింపుగా ఈ ఆహ్వానం లభించడం ఆనందంగా ఉందని, అమెరికాలో జరిగే ఏటీఏ--2026 మహాసభలకు తప్పకుండా హాజరవుతానని గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి తెలిపారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై ఎమ్మెల్యే కసిరెడ్డి సమీక్ష



**ఆమనగల్లు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేసి అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాకు దూరం కాకుండా చూడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికార యంత్రాంగం, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గట్టిపల్లపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని ప్రతి 10 మంది బీఎల్ఏలకు నియమితులైన 27 మంది సూపర్వైజర్లతో సమావేశమై కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ప్రతి సూపర్వైజర్ తమ పరిధిలోని బీఎల్ఏలు, బీఎల్ఓలతో సమన్వయం చేసుకుని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నియమించిన మిత్రులతో సమన్వయం కొనసాగిస్తూ ఆగస్టు 3వ తేదీలోపు ప్రత్యేక సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సింగల్ విండో కేశవ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డైరెక్టర్ అంజయ్య గుప్తా, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ రామలక్ష్మణ్, భూపతి రెడ్డి, డేవిడ్, రాజేందర్ నాయక్, ఫరీద్, ఖాదర్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్హుడి ఓటు నమోదు కాంగ్రెస్ శ్రేణుల బాధ్యత

**– టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్**

**– ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి**



**ఆమనగల్లు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యేలా, ఎవరి ఓటు కూడా కోల్పోకుండా కాంగ్రెస్ శ్రేణులు బీఎల్వోలు, బీఎల్ఏలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి, నుచ్చుగుట్ట తండా 204, 205 బూత్‌లలో ఓటరు నమోదు ప్రక్రియను రాష్ట్ర ఆదివాసీ కో-కన్వీనర్ కృష్ణా నాయక్, మాజీ మండల అధ్యక్షుడు జగన్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్, స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి అర్హుడైన పౌరుడికి అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఓటరు జాబితాలో కొత్త పేర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి ప్రక్రియలు పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి, ఒక్క అర్హుడి ఓటు కూడా కోల్పోకుండా కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందు నాయక్, ఎన్ఎస్యూఐ రాష్ట నాయకులు ఎండి ఫరీద్, కుమార్ నాయక్, బీఎల్వో దశరథ్, సికిందర్ తదితరులు ఉన్నారు.

# బాలుర వసతి గృహానికి స్వంత భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్



**నల్లగొండ, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండలోని తెలంగాణ షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహం (ఏ)కు స్వంత భవనం ఏర్పాటు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల లింగస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దండంపల్లి సరోజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాలుర వసతి గృహాన్ని సందర్శించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "విద్యార్థులు అద్దె భవనాల్లో ఉంటూ ప్రభుత్వం నెలకు వేల రూపాయలు కిరాయి చెల్లిస్తున్నా, యజమాన్యం మౌలిక వసతులు కల్పించడంలో విఫలమవుతోంది. కరెంటు, ఫ్యాన్లు, లైట్లు, కిటికీలు, తలుపులు చెడిపోయినా వెంటనే పనులు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి" అని పేర్కొన్నారు. స్థానిక మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వసతి గృహానికి స్వంత భవనం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు నాలుగు జతల స్కూలు యూనిఫామ్స్, బెడ్ షీట్స్, బ్లాంకెట్స్, బ్యాగులు, షూస్ వెంటనే అందించాలని, మెనూ ప్రకారం స్వచ్ఛమైన ఆహారం అందించాలని, గత సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న మెయింటెనెన్స్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మన్నెం బిక్షం, నాయకులు అంజయ్య, రాములు, మధు, సంధ్యారాణి, నాగమణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుత చండీ యాగంలో పాల్గొన్న బీచాని బాలకృష్ణ



**కల్వకుర్తి, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్ర 91వ విశ్వశాంతి మహాయా గంలో మంగళవారం కల్వకుర్తి తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీచాని బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృష్ణ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ఆదిత్య స్వరూపానంద స్వామి దివ్య ఆశీస్సులు లభించాయి. మహాయాగం అనంతరం బీచాని బాలకృష్ణ మాట్లాడుతూ, "విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న ఈ మహా యాగం ఎంతో పవి త్రమైనది. భారతీయ సంస్కృతి ప్రపంచానికి శాంతి, సామరస్యాన్ని బోధిస్తూ సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. కల్వకుర్తి పట్టణంతో పాటు అనేక ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు త రలి వస్తున్నారు. ప్రతినిత్యం త్యాగ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక శోభతో విరాజి ల్లుతోంది. ప్రపంచ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్



**కల్వకుర్తి, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాఠశాలల్లో రాష్ట్ర ఉపా ధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. రమేష్ మాట్లా డుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమ స్యలను ఇకపై వాయిదా వేయకుండా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశా రు. ఉపాధ్యాయులకు రావలసిన 6 డి.ఏ.ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, పిఆర్సిని వెంటనే ప్రకటించాలని వారు కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని, అలాగే జిపిఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్ పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి హనుమంత్ రెడ్డి, బిజినేపల్లి మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు శేఖర్, వెంకటస్వామి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## చింతకుంట విజయ రమణారావుకు మంత్రి హోదా కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సవాలు



**ఎలిగేడు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రి హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విప్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఆయనకు మంత్రి హోదా లభించడం పట్ల నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుతున్నారు. ఈ సందర్భంగా ఎలిగేడు పిఏసిఎస్ చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్ రావు మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కోసం విజయ రమణారావు చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి మంత్రి హోదా ఇవ్వడం జరిగింది. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ఆయన భవిష్యత్తులో మరిన్ని పదవులను అధిరోహించాలని కోరుకుంటున్నాం" అని పేర్కొ న్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు ఆనందోత్సవాలు జరుపుతూ, విజయ రమణారావు నాయకత్వంలో అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పవర్‌లూమ్ కార్మికుల కూలి రేట్లు 30% పెంచాలని సిఐటియు డిమాండ్

**నల్లగొండ, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పవర్‌లూమ్ కార్మికుల వేతన ఒప్పందం సెప్టెంబర్ 30, 2026తో ముగియనున్న నేపథ్యంలో కొత్త కూలి రేట్లను ఖరారు చేయడానికి వెంటనే యాజమాన్యాలు, కార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పవర్లూమ్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్మిక శాఖ అధికారికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ, రెండు సంవత్సరాల క్రితం కుదిరిన కూలి ఒప్పందం గడువు ముగియనుందని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో కార్మికుల జీవన వ్యయం కూడా అధికమైందని, అందుకు అనుగుణంగా కూలి రేట్లను సవరించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే జూన్ 18న మొదటి నోటీసు ఇచ్చినా



స్పందన రాకపోవడంతో యూనియన్ సమావేశంలో నిర్ణయం తీసుకుని రెండో నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. యూనియన్ ప్రధాన డిమాండ్లలో ప్రస్తుతం అమలులో ఉన్న కూలి రేట్లపై 30 శాతం పెంపు చేసి 2026 అక్టోబర్ 1 నుంచి అమలు చేయడం, మూర పిక్కు తగ్గించకుండా పెరిగిన శాతం ప్రకారం కొత్త రేట్లు అమలు చేయడం, గత ఒప్పందం ప్రకారం ఇవ్వాల్సిన బెల్లం ఈ సంవత్సరం నుంచి తప్పనిసరిగా ఇవ్వడం, అలాగే గత ఒప్పందంలోని అన్ని నిబంధనలను యథాతథంగా కొనసాగించడం ఉన్నాయి. యజమానులు వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి తేదీ, సమయం, స్థలాన్ని తెలియ జేయాలని యూనియన్ కోరింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, జిల్లా అధ్యక్షుడు గంజి నాగరాజు, నాయకులు పెండెం రాములు, గంజి రాజేష్, మూడా చంద్రకళ, పసునూరి యోగానందం, సురపల్లి భద్రయ్య, పెండెం బుచ్చి రాములు, దేవులపల్లి గిరిబాబు, చిట్టిపోలు వెంకటేశం, ఎల్లం ఆంజనేయులు, నిమ్మనగోటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటర్ ఓటును బి ఎల్ ఎ లు కాపాడాలి

**-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**దేవరకొండ జూలై 21.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి అర్హత కలిగిన పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటం కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలందరి బాధ్యత అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను ప్రతి ఒక్క అర్హులైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్రమత్తంగా పనిచేయాలని ఆయన సూచించారు. ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, అర్హులైన వ్యక్తి ఓటు జాబితాలో పేరు లేకపోతే ఎన్నికల్లో ఓటు వేయలేకపోవడంతో



పాటు, భవిష్యత్తులో ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాల విషయంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు. అందువల్ల ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బీఎల్ఏ, కార్యకర్త తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలించి, అవసరమైన చోట కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలు జరిగేలా ప్రజలకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే బీఎల్‌వోలు తో సమన్వయం చేసుకుంటూ సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని, ముఖ్యంగా యువత, మహిళలు, వృద్ధులు, గిరిజనులు, దూర ప్రాంత ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు."ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం... ప్రతి ఓటును కాపాడుకోవడం కాంగ్రెస్ పార్టీ బాధ్యత. దేవరకొండ నియోజకవర్గంలో ఒక్క అర్హులైన ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేయాలి" అని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు.

# కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రద్దుకై చలో కలెక్టరేట్

**నందికొట్కూరు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీ వేజ్, ఎన్.ఎం.ఆర్. గౌరవ వేతనం పేరుతో మూడు లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి నేటికీ కనీస వేతనాలు అమలు చేయకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడం దురదృష్టకరమని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసు సురత్నం, పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. జులై 30, 31 తేదీల్లో జరగనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు కానీ కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పు లేదు. కనీస వేతనాలు ఎన్నికల నినాదాలుగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పి కుర్చీ ఎక్కడం పరిపాటిగా మారింది. అతి తక్కువ వేతనాలతో పెరిగిన ధరల మధ్య కుటుంబ పోషణ ఎంత దుర్భరంగా ఉందో పాలకులకు పట్టడం లేదు" అని విమర్శించారు. 77 రకాల షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్ వర్కర్ల వేతనాల గురించి కూడా పాల కులు



పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఉస్మాన్ భాష, బసవరాజు, ఎన్. నరసింహ, ఎస్. వెంకటేశ్వర్లు, కాజా బాషా, నాగేశ్వ రరావు, పుల్లయ్య, శ్రీశైలం మండల కార్యదర్శి చిన్న మారేన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కర్ణ తదితరులు పాల్గొన్నారు.

# సీసీటీఎన్ఎస్ పై ప్రత్యేక శిక్షణ

**నందికొట్కూరు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ భాషా ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి సీసీటీఎన్ఎస్ పై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించబడ్డాయి. ఈ శిక్షణలో సీసీటీఎన్ఎస్ వ్యవస్థ వినియోగం, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియలో డిజిటల్ విధానాల అమలు, డేటా నమోదు, సమాచార నిర్వహణ వంటి



అంశాలపై పోలీసు సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. జిల్లా పోలీసు శాఖలో సేవల నాణ్యతను మెరుగుపరచడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం, ప్రజలకు వేగవంతమైన మరియు పారదర్శకమైన సేవలు అందించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా, సంబంధిత అధికారులు, శిక్షకులు మరియు జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీచార్జ్ అమానుషం నందికొట్కూరులో నిరసన

**నందికొట్కూరు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నీట్ పేపర్ లీక్‌కు కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ, "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిరసన తెలిపారు. స్థానిక కళాశాల నుండి సుమారు 200 మంది విద్యార్థులు ర్యాలీగా వచ్చి ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యూలో జిల్లా సహాయ కార్యదర్శి కే. ఆది మాట్లాడుతూ,




"నీట్ పేపర్ లీక్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన 18 మంది విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలి. వారి మరణాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలి" అని డిమాండ్ చేశారు. అలాగే జంతర్‌మంతర్‌లో నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ను అరెస్టు చేసి బలవంతంగా ఆసుపత్రికి తరలించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. లక్షలాదిమంది విద్యార్థులు శాంతియుతంగా పార్లమెంట్ ముట్టడికి వెళ్తుండగా వారిపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని పిడిఎస్యూతో పాటు విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు అంజి, అజయ్, శివాజీ, శ్రీధర్ రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం ఎంపీఈఓలతోనే సాధ్యం

**- గుజ్జుల గౌరీశ్వర నాయుడు**

**నందికొట్కూరు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు వ్యవసాయ రెగ్యులర్ సబ్-డివిజన్ కార్యాలయం ఎదుట మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు (ఎంపీఈఓలు) చేపట్టిన పెన్‌డౌన్ నిరసన మంగళవారం కొనసాగింది. తమ న్యాయమైన హక్కులు, ఉద్యోగ భద్రత, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ ఉద్యమాన్ని ప్రారంభించిన ఎంపీఈఓలకు వివిధ వర్గాల నుంచి సంఘీభావం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా సామాజిక సేవకుడు గుజ్జుల గౌరీశ్వర నాయుడు నిరసన శిబిరాన్ని సందర్శించి ఎంపీఈఓలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ, "రైతు సేవలో కీలక పాత్ర పోషిస్తున్న





ఎంపీఈఓల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరం. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో చేరవేయడంలో ఎంపీఈఓలు విశేష సేవలు అందిస్తున్నారు. రైతు సంక్షేమం అంటే రైతుకు సేవ చేసే ఉద్యోగుల సంక్షేమంతోనే సాధ్యం. వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ నైతిక బాధ్యత" అని స్పష్టం చేశారు. ఎంపీఈఓలు మాట్లాడుతూ, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓల నాయకులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొని సంఘీభావం తెలిపారు.

బుధవారం,
జూలై 22, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# రూ.500 కోట్లతో ఆసుపత్రి కట్టారు - సేవలు మాత్రం అందట్లేదు : ఇక అంతా సర్కారు దయ!

**గోదావరిఖని:** ఇప్పుడున్న ఆసుపత్రి, వైద్య సౌకర్యాలు అక్కడి ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాలంటే ఇప్పటికే దాదాపుగా నిర్మాణం పూర్తైన ఆసుపత్రి భవనం వినియోగంలోకి రావాలి. రోగులకు సకల సౌకర్యాలు అందించాలంటే ఇంకా రూ.100 కోట్ల నిధులు కావాలి. ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులన్నీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సింగరేణి ఇచ్చినవే. మిగిలిన నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తే అందుబాటులోకి రానున్న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో 355 పడకల ప్రభుత్వాసుపత్రిపై 'ఈటీవీ-ఈటీవీ భారత్ ప్రత్యేక కథనం. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ప్రభుత్వ సార్వజనీయ ఆసుపత్రి నిర్మాణంలో నిధుల కొరత కారణంగా జాప్యం జరుగుతోంది. సామాజిక బాధ్యతగా సింగరేణి యాజమాన్యం అక్కడ ప్రభుత్వాసుపత్రి సహా బోధన కళాశాల నిర్మాణానికి రూ.510 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో అక్కడ మెడికల్ కాలేజీతో పాటు 355 పడకలతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టారు. వైద్య కళాశాల నిర్మాణం



పూర్తైనా, ప్రస్తుతం ఇచ్చిన నిధులు అయిపోవడంతో హాస్పిటల్ భవన నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది. మంచినీటి, మురుగు నీటి వ్యవస్థ, పెయింటింగ్, ఇతర మౌలిక వసతులకు సంబంధించి దాదాపు రూ.45 కోట్ల విలువైన పనులు మిగిలిపోయాయి. రూ.100 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ : దీంతో పాటు ప్రహరీ గోడ, మార్చురీ, కళాశాల నుంచి ఆసుపత్రికి ఫుట్? ఓవర్ బ్రిడ్జ్, ఎస్టీపీ, వెయిటింగ్ హాల్, సెంట్రల్ కిచెన్ లాంటి అదనపు వసతుల కల్పన కోసం మరో రూ.55 కోట్లు కావాల్సి ఉంది. మొత్తం రూ.100 కోట్లు కేటాయిస్తే పూర్తి స్థాయిలో అత్యాధునిక వైద్య సేవలు అక్కడ అందుబాటులోకి వస్తాయి. సింగరేణి యాజమాన్యం మళ్లీ నిధులు ఇచ్చే నుంచి రూ.100 కోట్లు మంజూరు చేయాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి."మరో రూ.100 కోట్లు కేటాయిస్తే బిల్డింగ్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. ఫినిషింగ్ వర్క్ మాత్రమే మిగిలిపోయింది. ఇందులో ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ కూడా లేదు. దాన్ని కూడా అందుబాటులోకి తీసుకురావాలి. గుండెకు సంబంధించిన సెంటర్? కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. సరిపడా నిధులు లేక పనులు నత్తనడకన నడుస్తున్నాయి" - స్థానికులుపూర్తైతే మొత్తం 600 పడకలు అందుబాటులోకి : ప్రస్తుతం సింగరేణిలో 120 పడకల ఆసుపత్రి, క్రిటికల్ కేర్ యూనిట్, 80 పడకల ఆసుపత్రుల ద్వారా రోగులకు సేవలు అందుతున్నాయి. 355 పడకల ఆసుపత్రి పూర్తైతే మొత్తం 600 పడకలు అందుబాటులోకి వస్తాయి. దీంతో పాటు అన్ని వైద్య విభాగాలకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ సేవలు సైతం అందుతాయి. క్యాథ్ ల్యాబ్, ఎంఆర్?ఐ లాంటి సౌకర్యాలు కల్పిస్తే రోగులు మరోచోటుకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. దీంతో వీలైనంత త్వరగా కొత్త ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయిస్తే ఆసుపత్రి నిర్మాణం పనులు పూర్తై, అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రైతు కోసమే పొలం పిలుస్తుంది



**నందికొట్కూరు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతు అభ్యున్నతి లక్ష్యంగా నందికొట్కూరు, మిడుతూరు మండల పరిధిలోని నాగటూరు, కొణిదెల గ్రామాల్లో "పొలం పిలుస్తుంది" కార్యక్రమం నిర్వహించారు. మండల అగ్రికల్చర్ ఏఈ షేక్షావలి ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ ఏఈ మాట్లాడుతూ, పంటల క్రాప్ కండిషన్ మరియు క్రాప్ సిచువేషన్ పై రైతులతో చర్చించారు. ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానం గురించి వివరించారు. అలాగే వాతావరణ బీమా మరియు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 30వ తేదీ లోపల రెండు బీమా పథకాలకూ చివరి తేదీ ముగియనుందని, రైతులందరూ తప్పనిసరిగా క్రాప్ ఇన్సూరెన్స్ కట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొని పంటల సంరక్షణ, బీమా ప్రయోజనాలపై అవగాహన పొందారు.

## ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి



**నందికొట్కూరు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు పురపాలక సంఘం పరిధిలోని కంపోస్ట్ యార్డులో జరుగుతున్న లెగసీ బయో రిమిడియేషన్ పనులను మంగళవారం మున్సిపల్ కమి షనర్ జి. వెంకటరామిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు లెగసీ బయో రిమిడియేషన్ ప్రక్రియ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పేరుకుపోయిన పాత ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసి ఉపయోగకరమైన పదార్థాలను వేరు చేయడం ద్వారా చెత్త కుప్పల వల్ల కలిగే దుర్వాసన, భూగర్భ జలాల కాలుష్యం, అగ్ని ప్రమాదాల ప్రమాదం తగ్గుతుందని ఆయన వివరించారు. పాత చెత్తను తవ్వి గుట్టలుగా ఏర్పాటు చేసి, బయో-కల్చర్ పిచికారీ ద్వారా వ్యర్థాలను స్థిరీకరిస్తారు. అనంతరం ట్రామెల్ యంత్రాల సహాయంతో ప్లాస్టిక్, లోహాలు, మట్టి వంటి పదార్థాలను వేరు చేస్తారు. రీసైకిల్ చేయగల పదార్థాలను తిరిగి వినియోగానికి పంపించి, మిగిలిన భూమిని పరిశుభ్రంగా అభివృద్ధి చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత పేరుకుపోయిన చెత్తను పూర్తిగా రీసైకిల్ చేసి ఎరువుగా ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కమిషనర్ సూచనలు చేశారు.

# వైభవంగా ఎల్లమ్మ తల్లి కల్యాణం.. జోగినిలకు ప్రాముఖ్యం

**హైదరాబాద్, జులై 21:** బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. దర్శనాలు, వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని జఊజూ గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం





జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయి: మంత్రి పొన్నంమహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో ఎన్నో విపత్తులు ఎదుర్కొన్నామని.. ఎన్‌లినోను కూడా ఎదుర్కుంటామన్నారు. అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. సంవృద్ధిగా వర్షాలు పడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆషాఢమాస బోనాలు ఘనంగా జరిగేలా దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్ని ఏర్పాట్లు చేసినా చిన్న చిన్న ఇబ్బందులు జరుగుతుంటాయని.. వాటిని అధిగమించి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర మీద ఉండాలని, సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# మూడేళ్లయినా.. నో 'కేవైసీ'!

**సంగారెడ్డి:** నిజమైన లబ్ధిదారులకే రేషన్ అందేలా చూడటం కోసం రేషన్‌కార్డుదారులకు ఈ-కేవైసీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కార్డులోని సభ్యులందరూ రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచిందింది. కానీ, ఈ ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోంది. రేషన్‌కార్డులో సభ్యులకు అన్నపూర్ణ కార్డుదారులకు ఒక్కో యూనిట్‌కు 10 కిలోల చొప్పున, అంత్యోదయ కార్డుదారులకు ఒక్కో యూనిట్‌కు 35 కిలోలు, ఆహార భద్రత కార్డుదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. అయితే, కార్డుల్లో సభ్యులుగా ఉన్నవారు చనిపోయినా వారి పేర్లు కార్డులో కొనసాగుతున్నాయి. వారికి పేరిట కుటుంబ సభ్యులు రేషన్ కోటా తీసుకుంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి తొలగించేందుకు ఈ-కేవైసీ తప్పనిసరి చేసింది. ఈమేరకు లబ్ధిదారులు రేషన్ దుకాణానికి వెళ్లి ఈ పాస్ మిషన్‌లో వేలి ముద్ర వేయడం ద్వారా కేవైసీ నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ, రేషన్‌కారు లబ్ధిదారులు ఈ-కేవైసీ చేసుకోవడంలో నిర్లిప్తత



ప్రదర్శిస్తున్నారు. మూడేళ్లలో పలుమార్లు గడువు పొడిగించినా ఇంకా వందశాతం పూర్తికాలేదు. తాజాగా ఈ నెల 31 వరకు ప్రభుత్వం పొడగించింది. అప్పటికీ ఈ-కేవైసీ పూర్తిచేయకపోతే లబ్ధిదారులకు రేషన్ నిలిచిపోయే అవకాశం ఉంటుందని అధికారు లు స్పష్టం చేస్తున్నారు. వేలాది మంది దూరంసంగారెడ్డి జిల్లాలో 15,08,162 మంది రేషన్‌కార్డు లబ్ధిదారులు ఉండగా ఇప్పటివరకు 11,66,189 మంది (77.33 శాతం) ఈ-కేవైసీ నమోదు చేసుకున్నారు. ఇంకా ఇంకా 3,41,973 మంది ఈ-కేవైసీ చేసుకోలేదు. మెదక్ జిల్లాలో రేషన్ ఈకేవైసీ 80.03 శాతం పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 2,41,832 కార్డులు... 7,90,304 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటివరకు ఈ-కేవైసీ చేసుకున్నవా రు 6,32,457 మంది, ఇంకా 1,57,847 మంది కేవైసీ పూర్తిచేయలేదు. కొన్నిచోట్ల మృతిచెందిన వారి పేరిట ప్రతీ నెల ఉచితంగా రేషన్ తీసుకు ంటున్నారు. ఎవరైతే ఈ-కేవైసీ నమోదు చేసుకోరో వారి కోటాను నిలిపివేయను న్నారు. సంగారెడ్డి: తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులకు మరోసారి మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఈమేరకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులకు ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. సంగారెడ్డి జిల్లాలో 4,47,375 తెల్ల రేషన్ కార్డులు ఉండగా, 15,08,162 మందికి ప్రతీ నెల సుమారు 9,542 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో 2,41,832 తెల్లకార్డుల్లో 7,90,304 లబ్ధిదారులకు 4వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఇస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల బియ్యం... ఒకేసారి ఆగస్టులో ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గత వేసవిలోనూ మూడు నెలల రేషన్ ఒకేసారి ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో లబ్ధిదారులు ప్రతీనెల రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం తప్పనుంది. కానీ, మూడు నెలలకు సంబంధించిన బియ్యం కోటాను ఒకేసరి ఇవ్వడంతొ రేషన్‌దుకాణాల్లో స్థలం లేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

## 'ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి'

**కొత్తగూడెం, జూలై 21 :** భారతీయ రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాల మేరకు ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ) ఆధ్వర్యంలో కొత్తగూడెం ఆర్సేఓ పరిధిలోని సీఎఫ్ఎల్ ప్రతినిధులు, సీఎస్‌పీలతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం రీజినల్ మేనేజర్ పిజిఎన్ శర్మ మాట్లాడుతూ.. సీఎఫ్ఎల్‌లు, సీఎస్‌పీలు పరస్పర సమన్వయంతో పనిచేస్తు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడంతో పాటు బ్యాంకింగ్ సేవల వినియోగాన్ని మరింత విస్తరించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అటల్ పెన్షన్ యోజన ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన వంటి సామాజిక భద్రత పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రధానమంత్రి జన్ ధన్ యోజన ఖాతాల్లో కేవైసీ (ఖ్జ)



అప్‌డేట్ చేయని ఖాతాదారులకు వెంటనే రీ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త బ్యాంకు ఖాతాలు తెరవడానికి సీఎస్‌పీలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువయ్యేలా సీఎఫ్ఎల్‌లు, సీఎస్‌పీలు సమిష్టిగా పనిచేసి ఆర్థిక చేర్పును మరింత బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, కొత్తగూడెం ఆర్సేఓ ఎఫ్ఐ మేనేజర్ భాను పద్మశ్రీ, పీ పాయింట్ జిల్లా మేనేజర్ భానోత్ కిషోర్, సిఎఫ్ఎల్ సి సి, నాగేందర్, పాటు వివిధ ప్రాంతాలకు చెందిన సీఎస్‌పీ, సిఎఫ్ఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణకు రెయిన్ అలర్ట్.

**హైదరాబాద్ :** తెలంగాణలో చాలా రోజుల తర్వాత వర్షాకాలం ఫీల్ కలుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గత రెండ్రో జులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసాయి. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఆసిఫాబాద్, జగిత్యాల జిల్లాల్లో రాత్రి వేళల్లో కుండపోత వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు నమోదు కానంతగా వర్షపాతం నమోదు కావడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో అత్యధికంగా 124 మి.మీ, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 109.5 మి.మీ వర్షపాతం రికార్డైంది. కాగా, రానున్న 24 గంటలు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రోజంతా ముసురు పడే అవకాశాలు



కనిపిస్తున్నాయన్నారు. రాబోయే మూడు గంటల్లో సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి , ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. అలాగే మెదక్, సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, సిరిసిల్ల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో తేలికపాటి మెదక్, సిద్దిపేట, జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోనూ అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు పడవచ్చునని అంచనా వేస్తున్నారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చేదు అనుభవం

**హైదరాబాద్ :** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చేదు అనుభవం ఎదురైంది. వీఐపీలు ప్రవేశించే గేట్ నంబర్ 6 నుంచి కాకుండా, సామాన్య ప్రజలు ప్రవేశించే గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని రంగనాథ్‌కు సూచించిన సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో గేట్ నంబర్ 4 వద్ద సామాన్య ప్రజలు వాహనాలు పార్క్ చేసే స్థలంలో కారు పార్క్ చేసి, అక్కడి నుండి నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లారు. కాగా, ప్రైవేట్ ఆస్తి వివాదంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒకే అంశానికి సంబంధించి ఏకంగా మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవడం అత్యంత తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం వెనుక కారణమేమిటని నిలదీసింది. ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని స్పష్టమైన ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని లెకచేయకుండా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించింది. కోర్టు






ఉత్తర్వుల ఉల్లంఘన అలవాటుగా మారిందా? కోర్టు ధికరణనే పరిపాటిగా మార్చుకున్నారా? అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకటి కాదు, రెండు కాదు, ఒకే అంశంపై మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవుతున్నాయంటే కోర్టు ఉత్తర్వుల పట్ల ఎంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతున్నదని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టుల పట్ల ఎంత గౌరవం ఉన్నదో ఈ పరిణామాలే చెప్తున్నాయని పేరొంది. ఇకడ బాధితుడు పిటిషనర్ కాదని, స్వయంగా కోర్టేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వులను ధికరించడం ఎంతమాత్రం సహించబోమని రంగనాథ్‌కు తేల్చిచెప్పింది. ప్రభుత్వమైనా, ప్రభుత్వాది ,కారులైనా చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల పరిరక్షణ పేరుతో కోర్టు ఉత్తర్వులను పకనపెట్టి ప్రైవేటు భూముల్లోకి వెళ్లడం ఏ చట్టం ప్రకారం సమర్థనీ యమని ప్రశ్నించింది. యజమాని అనుమతి లేకుండా ప్రైవేటు భూమిలో అడుగు పెట్టరాదన్న ప్రాథమిక సూత్రం తెలియదా అని నిలదీసింది. ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యమైతే ప్రైవేటు వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు ఎందుకు చేశారని ప్రశ్నించింది.

# హాకీ వరల్డ్‌కప్‌నకు భారత జట్టు ప్రకటన



2026 హాకీ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు హాకీ ఇండియా భారత జట్టును మంగళవారం ప్రకటించింది. 20 మంది సభ్యులతో కూడిన జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ వచ్చే నెల 15న ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లకు నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ టోర్నీలో భారత్ పూల్ డీలో ఉంది. ఈ గ్రూప్‌లో భారత్‌తోపాటు ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్ జట్లు ఉన్నాయి. పురుషుల టోర్నీలో 16 జట్లు పోటీలో ఉన్నాయి. నాలుగేసి జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రపంచ కప్ జట్టు ఎంపికపై టీమ్ హెడ్ కోచ్ ఫుల్టన్ మాట్లాడారు. 'ఇది చాలా సమతుల్యమైన జట్టు. ఇందులో అనుభవం ఉన్న ఆటగాళ్లు ఉన్నారు. అలాగే అద్భుతమైన ఫామ్‌లో ఉన్న యువ ఆటగాళ్లూ ఉన్నారు. ఈ ఇద్దరితో టీమ్ బ్యాలెన్స్‌గా ఉంది. భారత్ ప్రపంచ కప్ గెలిచి 50 ఏళ్లు పూర్తయింది. అందుకే ఇది మాకు ఒక ప్రత్యేకమైన ఎడిషన్ కానుంది. ఆ చరిత్ర ఈ వరల్డ్‌కప్‌నకు మాకు ప్రేరణ ఇస్తుంది. ఒత్తిడిలో చురుకైన నిర్ణయాలు తీసుకోవడం, మంచి ఔట్‌పుట్ ఇవ్వడంపైనే మేం దృష్టి పెట్టాము. మా ప్లేయర్లకు ఆట పట్ల నిబద్ధత ఉంది. వారు తమమత అత్యుత్తమ ప్రదర్శననిస్తూ, జట్టులో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటున్నారు. పోటీ ఎంత కఠినంగా ఉంటుందో మాకు తెలుసు. కానీ మా ఆటపై మాకు నమ్మకం ఉంది. మా స్ట్రాటజీ సింపుల్. ఆటపైనే పూర్తి దృష్టి పెట్టడం, పూర్తి స్థాయిలో నిమగ్నమవుతూ టైటిల్ సాధించడమే మా టార్గెట్' అని కోచ్ అన్నారు.

పురుషుల హాకీ వరల్డ్‌కప్ 1971లో ప్రారంభం కాగా ఆ ఎడిషన్ (తొలి)లో భారత్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రెండో ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిచింది. అయితే మూడో ఎడిషన్ (1975లో) ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన టీమ్ఇండియా టైటిల్ ముద్దాడింది. అర్జిత్ పాల్ సింగ్ కెప్టెన్సీలో టీమ్ఇండియా 2-1 తేడాతో పాక్‌ను ఓడించింది. ఇక ఆ తర్వాత భారత్ మళ్లీ ఈ టోర్నీలో టైటిల్ అందుకోలేదు. గత ఎడిషన్ (2023) భారత్ తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈసారి బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. 50ఏళ్ల నాటి మ్యాజిక్‌ను రిపీట్ చేసి రెండోసారి ఈ టైటిల్‌ను సాధించడమే లక్ష్యంగా హర్మన్‌ప్రీత్ సేన వరల్డ్‌కప్‌లో ఆడనుంది.జట్టు ప్రకటన సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈసారి పక్కా 'కప్పును ఇంటికి తీసుకొస్తాం' అని ధీమాగా చెప్పాడు. 'వరల్డ్‌కప్‌ను మరోసారి పక్కా మన ఇంటికి (భారత్‌కు) తీసుకొస్తాం. దేశాన్ని గర్వపడేలా చేసేందుకు మాకు ఇదొక మంచి అవకశం' అని హర్మన్‌ప్రీత్ అన్నాడు.

# జింబాబ్వే గడ్డపై అడుగుపెట్టిన భారత్..



ఇంగ్లాండ్ పర్యటన ముగిసింది. ఆదివారం (జులై 19, 2025) లార్డ్స్ వేదికగా జరిగిన చివరి వన్డేలో భారత్ ఓడిపోయి.. సిరీస్ కోల్పోయింది. అయితే ఇది జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే టీమిండియా మరో పర్యటనకు సిద్ధమైంది. జులై 23 నుంచి జింబాబ్వేతో 3 టీ20ల సిరీస్ జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగింది. ఇక ఈ సిరీస్ కోసం ఒక్క చోట చేరిన భారత ఆటగాళ్లు.. మంగళవారం (జులై 21) జింబాబ్వేలో అడుగుపెట్టారు. ఈ మేరకు భారత ఆటగాళ్ల జింబాబ్వే ప్రయాణానికి సంబంధించిన వీడియోను బీసీసీఐ.. సోషల్ మీడియాలో షేర్ చేసింది. ముంబై టు హరారే అని క్యాప్షన్ ఇచ్చింది. ఇందులో తిలక్ వర్మ, ప్రభ్ సిమ్రాన్ సింగ్, మయాంక్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్ తదితరులు కనిపించారు. టీమిండియా సీనియర్ జట్టుకు షెడ్యూల్ బిజీగా ఉండటంతో.. వీవీఎస్ లక్ష్మణ్ .. ఈ సిరీస్‌కు తాత్కాలిక హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. జట్టుతో పాటు అతడు కూడా జింబాబ్వేకు వెళ్లాడు. భారత క్రికెట్ జట్టు ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్ పర్యటనలో ఆశించిన స్థాయి ఫలితాలను సాధించలేకపోయింది.

టీ20, వన్డే సిరీస్‌లలో ఓటమి పాలైన నేపథ్యంలో.. జింబాబ్వే పర్యటన కీలకంగా మారింది. యూకే పర్యటనలో ఎదురైన చేదు అనుభవాలను, చేజారిన సిరీస్‌ల పరాజయాలను పక్కన పెట్టి, జింబాబ్వేపై ఘన విజయం సాధించి మళ్లీ గెలుపు బాట పట్టాలని టీమిండియా పట్టుదలతో ఉంది. సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో, ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టిన యువ ఆటగాళ్లు.. ఈ సిరీస్‌లో తుది జట్టులోకి రానున్నారు. గౌతమ్ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భారత జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. టీ20 వరల్డ్ కప్ గెలిచినప్పటికీ.. దశాబ్దాల తర్వాత శ్రీలంక చేతిలో ఓడటం, సొంత గడ్డ మీద న్యూజిలాండ్ చేతిలో వైట్ వాష్‌కు గురి కావడం, ఐర్లాండ్, ఇంగ్లాండ్ గడ్డ మీద సిరీస్‌లు ఓడటం లాంటివి చోటు చేసుకున్నాయి. దీంతో గంభీర్ తీరు పట్ల విమర్శలు వస్తున్నాయి. ఐస్‌లాండ్ క్రికెట్ గంభీర్ పరువు తీసేలా ట్వీట్ వేసింది. ఇప్పుడు భారత జట్టు లక్ష్మణ్ మార్గదర్శకత్వంలో జింబాబ్వే టూర్‌కు వెళ్లింది. దీని వల్ల ఇప్పటికిప్పుడు గంభీర్‌కు వచ్చిన ఇబ్బందేం లేదు. సరిపడా విశ్రాంతి తీసుకొని, ఒత్తిడి తగ్గించుకోవడానికి ఇది గంభీర్‌కు ఉపకరిస్తుంది. కానీ భవిష్యత్తు టోర్నీల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేస్తేనే గంభీర్‌పై బీసీసీఐ నమ్మకాన్ని కొనసాగిస్తుంది. లేకపోతే 2027 వరల్డ్ కప్ తర్వాత అతడిపై వేటు పడే అవకాశం ఉంది.భారత్, జింబాబ్వే సిరీస్ షెడ్యూల్..తొలి టీ20: జులై 23 – హరారే స్పోర్ట్స్ క్లబ్‌రెండో టీ20: జులై 25 – హరారే స్పోర్ట్స్ క్లబ్‌మూడో టీ20: జులై 26 – హరారే స్పోర్ట్స్ క్లబ్‌జింబాబ్వే పర్యటనకు భారత టీ20 జట్టు..శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్)



# హిట్‌మ్యాన్‌ను పొగడ్తలతో ముంచెత్తిన రవిశాస్త్రి

లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్ కంటే ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వైపు చూస్తున్న భారత సెలెక్టర్లు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. రోహిత్ శర్మను ఇకపై జట్టులోకి తీసుకోకపోవచ్చని, లార్డ్స్ మ్యాచ్ అతనికి ఆఖరిది కానుందంటూ వార్తలు వచ్చాయి. అయితే 39 ఏళ్ల రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో విశ్వరూపం చూపించాడు. వింటేజ్ ఆటతో ఇంగ్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. దీంతో తనపై విమర్శలు గుప్పించిన వారి నోళ్లను హిట్ మ్యాన్ మూయించాడు.మైదానం నలుమూలలా బాదుతూ రోహిత్ శర్మ ఆడిన షాట్లు లార్డ్స్ మైదానాన్ని హోరెత్తించాయి. తొలి రెండు వన్డేల్లో 11, 26 పరుగులు మాత్రమే చేసి విఫలమైన రోహిత్, ఆఖరి వన్డేలో అద్భుతంగా పుంజుకున్నాడు. 110 బంతుల్లో 138 పరుగులు స్కోరు చేశాడు. ఇందులో 5 సిక్సలు, 17 ఫోర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌పై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. రోహిత్ శర్మ తనకు తానుగా కొత్తగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదని, తన అద్భుతమైన సెంచరీతో విమర్శకుల నోళ్లను శాశ్వతంగా మూయించేశాడని రవిశాస్త్రి పేర్కొన్నాడు. ఒక ఆటగాడు జట్టుకు అంత సేవ చేసిన తర్వాత ఇలాంటి రూమర్లు రావడం విసుగు కలిగిస్తుందని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. రోహిత్ శర్మలో ఇంకా ఆడేందుకు కసి ఉన్నన్ని రోజులు అతడికి అవకాశం ఇవ్వాలని.. సెలెక్టర్లను కోరాడు. తనకు ఇక ఆడే సామర్థ్యం లేదని రోహిత్ భావించిన రోజే అతడే స్వయంగా తప్పుకుంటాడని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. మరోవైపు తన రీఎంట్రీ ఇన్నింగ్స్ పై రోహిత్ శర్మ బీసీసీఐ అప్‌లోడ్ చేసిన వీడియోలో స్పందించాడు. బయట వచ్చే విమర్శలు, కామెంట్లు తనకు అనవసరమని, మైదానంలోకి వెళ్లి పరుగులు సాధించడమే తన బాధ్యత అని రోహిత్ చెప్పాడు. విమర్శలు లేకపోతే కిక్కు ఉండదని, బయట వారు చేసే పని వారు చేస్తుంటే, మైదానంలో తాను చేయాల్సిన పని తాను చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు.

# స్పెయిన్‌కు సుమారు రూ.430 కోట్ల ప్రైజ్ మనీ

2026 ఫిఫా ప్రపంచకప్‌కు ఘన ముగింపు లభించింది. అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రం ఈస్ట్ రూథర్‌ఫోర్డ్‌లో ఉన్న మెట్లైఫ్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచ విజేతగా అవతరించింది. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో సాధించిన టైటిల్‌ను నిలబెట్టుకోవాలన్న అర్జెంటీనా ఆశలు ఫైనల్లోనే ఆగిపోయాయి. మరోవైపు యువ ఆటగాళ్లతో బలంగా కనిపించిన స్పెయిన్ చరిత్రలో రెండోసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఈ విజయంతో స్పెయిన్‌కు ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యున్నత గౌరవంతో పాటు భారీ ఆర్థిక లాభం కూడా దక్కింది. ఫిఫా ప్రకటించిన రికార్డు స్థాయి ప్రైజ్ ఫండ్‌లో విజేతగా నిలిచిన స్పెయిన్‌కు 50 మిలియన్ అమెరికన్ డాలర్లు లభించనున్నాయి. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.430 కోట్లకు సమానం. పురుషుల ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో విజేతకు లభించిన అత్యధిక ప్రైజ్ మనీ ఇదే కావడం విశేషం. ఫైనల్లో ఓడిపోయినా అర్జెంటీనా ఖాళీ చేతులతో వెళ్లలేదు. రన్నరప్‌గా నిలిచిన ఆ జట్టుకు 33 మిలియన్ డాలర్లు దక్కనున్నాయి. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.284 కోట్లకు సమానం. 2022 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఫ్రాన్స్ పొందిన మొత్తంతో పోలిస్తే ఇది మరింత ఎక్కువ. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌పై ఇంగ్లండ్ విజయం సాధించింది. దీంతో ఇంగ్లండ్‌కు 29 మిలియన్ డాలర్లు (సుమారు రూ.249 కోట్లు), నాలుగో స్థానంలో నిలిచిన ఫ్రాన్స్‌కు



27 మిలియన్ డాలర్లు (సుమారు రూ.232 కోట్లు) ప్రైజ్ మనీ లభించనుంది.ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో నేతృత్వంలోని ఫిఫా కౌన్సిల్ 2025 డిసెంబరులో ప్రకటించిన వివరాల ప్రకారం, 2026 ప్రపంచకప్ కోసం మొత్తం 655 మిలియన్ డాలర్ల ప్రైజ్ ఫండ్‌ను కేటాయించింది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.5,630 కోట్లకు సమానం. 2022 ప్రపంచకప్‌తో పోలిస్తే ఇది దాదాపు 50 శాతం అధికం. అంతేకాకుండా టోర్నమెంట్‌కు అర్హత సాధించిన ప్రతి జట్టుకు సిద్ధత ఖర్చుల కోసం అదనంగా 1.5 మిలియన్ డాలర్లు కూడా అందజేశారు. అంటే సుమారు రూ.13 కోట్లకు పైగా ప్రతి జట్టుకు ముందుగానే లభించింది. టోర్నమెంట్‌లో వ్యక్తిగత అవార్డుల విభాగంలో ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపే మెరిశాడు. మొత్తం 10 గోల్స్ చేసి గోల్డెన్ బూట్ అవార్డును సొంతం చేసుకున్నాడు. అతడు నాలుగు అసిస్ట్‌లు కూడా నమోదు చేశాడు. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఎనిమిది గోల్స్, నాలుగు అసిస్ట్‌లతో రెండో స్థానంలో నిలిచాడు. ఈ ప్రపంచకప్‌తో ఎంబాపే తన కెరీర్ వరల్డ్‌కప్ గోల్స్ సంఖ్యను 22కు పెంచుకున్నాడు. దీంతో 21 వరల్డ్‌కప్ గోల్స్‌తో ఉన్న మెస్సి రికార్డును అధిగమించిన ఆటగాడిగా నిలిచాడు.ప్రపంచకప్ విజేత స్పెయిన్ జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ రోడ్రీకి గోల్డెన్ బాల్ అవార్డు దక్కింది. టోర్నమెంట్ మొత్తం స్పెయిన్ ఆటను నియంత్రించడంలో, మిడ్‌ఫీల్డ్‌లో ఆధిపత్యం చెలాయించడంలో రోడ్రీ కీలక పాత్ర పోషించాడు. టోర్నమెంట్‌లో అత్యధిక పాస్‌లు పూర్తి చేసిన ఆటగాడిగా కూడా అతడు రికార్డు సృష్టించాడు. స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడంలో రోడ్రీ ప్రదర్శన ప్రధాన కారణంగా నిలిచింది.

# ముగిసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

## ఓవరాల్ చాంపియన్‌గా మేడ్చల్ మల్కాజ్‌గిరి

హైదరాబాద్ :మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన 11వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్‌జిల్లా స్విమ్మింగ్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. 54 పసిడి పతకాలు, 50 రజత పతకాలు, 26 కాంస్య పతకాలు సాధించిన మేడ్చల్ మల్కాజ్‌గిరి రాష్ట్ర స్థాయిలో ఓవరాల్‌గా చాంపియన్‌గా నిలిచింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి 472 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 293 పాయింట్లతో రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానంలో నిలువగా.. ఆ జిల్లా స్విమ్మర్లు 34 పసిడి, 25 సిల్వర్, 24 కాంస్య పతకాలు కొల్లగొట్టారు.స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు నిలిచిన క్రీడాకారులకు, ఓవరాల్ చాంపియన్‌షిప్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లాలకు తెలంగాణ స్విమ్మింగ్



సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి జి ఉమేశ్‌లు బహుమతులు ప్రదానం చేశారు.

బుధవారం, జూలై 22, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం



నటసింహం, స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తన తాజా చిత్రం 'NBK111' షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంచు మనోజ్‌తో కలిసి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడటంతో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది.

ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిత్ర యూనిట్ సభ్యులు షూటింగ్‌ను అక్కడికక్కడే నిలిపివేసి, ఆయనను తక్షణ చికిత్స కోసం సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలోని వైద్యుల బృందం బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను పూర్తి చేసింది. ఈ గాయం చాలా స్వల్పమైనదేనని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, త్వరగా కోలుకోవడానికి కొన్ని రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించారు.

'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ విజయం తర్వాత బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండవ చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కాకినాడ షెడ్యూల్‌లో రిస్కీ యాక్షన్ దృశ్యాలను తెరకెక్కిస్తున్న సమయంలో ఈ అనుకోని సంఘటన జరిగిందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా స్థిరంగా ఉందని, ఆసుపత్రి నుంచి త్వరలోనే డిశ్చార్జ్ అయి తిరిగి కోలుకుంటారని సమాచారం.



# చరణ్ సరసన రష్మిక?..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రాబోతున్న చిత్రం 'ఆర్‌సీ17' (వర్కింగ్ టైటిల్)పై సినీ వర్గాల్లో అంచనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడం, ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప' ఫ్రాంచైజీ సినిమాలు చరిత్ర సృష్టించడం నేపథ్యంలో... ఈ కొత్త ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరుకున్న ఈ సినిమాని త్వరలోనే సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మొదట కియారా అద్వానీ పేరు వినిపించినా, తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న పేరు బలంగా వినిపిస్తోంది.

సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పుష్ప' సిరీస్‌తో రష్మిక పాన్-ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించుకుంది. ఆ చిత్రంలో ఆమె నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు 'ఆర్‌సీ17' కోసం సుకుమార్ ఒక బలమైన, కథను మలుపు తిప్పే మహిళా పాత్రను రాసుకున్నారని, ఆ పాత్రకు రష్మిక అయితేనే పూర్తి న్యాయం చేయగలదని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఆమెకున్న పాన్-ఇండియా ఇమేజ్ కూడా సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం అంచనా వేస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథాగమనంలో అత్యంత కీలకంగా ఉండనుందని తెలుస్తోంది. చరణ్ మాస్ ఇమేజ్, సుకుమార్ టేకింగ్, దానికి రష్మిక నటన తోడైతే బాక్సాఫీస్ వద్ద కొత్త చరిత్ర ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 'రంగస్థలం'తో రికార్డులు సృష్టించిన ఈ కాంబో, మరోసారి అంతకుమించిన విజయాన్ని అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, హీరోయిన్ ఎంపికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు రష్మిక ప్రస్తుతం తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి' అనే భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రంలో నటిస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, 19వ శతాబ్దంలో రాయలసీమలో కరవు సమయంలో బ్రిటిష్ పాలనపై పోరాడిన ఓ యోధుడి కథ ఆధారంగా తెరకెక్కుతోంది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్-రష్మిక కాంబోలో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై కూడా భారీ అంచనాలున్నాయి.



# శ్రీనివాస మంగాపురం నుంచి రావే చెలియా విడుదల

ఘట్టమనేని జయకృష్ణ హీరోగా అజయ్ భూపతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రషా థడానీ కథానాయికగా అలరించనున్నారు. జులై 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. రావే చెలియా అంటూ సాగే ఈ పాటలో 'నా ప్రాణం నను వీడి.. నీ వైపే కదిలేనే' అనే లిరిక్స్ యూత్‌ను ఆకట్టుకుంటున్నాయి.

# పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార



తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు. సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్ర్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెళిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.

# 'టాక్సిక్' నుంచి రెండో పాట.. యశ్-తారా రొమాన్స్‌తో 'మనసు ఆగదు'!



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతోంది. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి చిత్రబృందం రెండో పాట 'మనసు ఆగదే'ను విడుదల చేసింది. ఇప్పటికే వచ్చిన తొలి పాట 'తబాహి'తో బోల్డ్ రొమాంటిక్ టోన్‌ను చూపించిన మేకర్స్.. ఇప్పుడు రెండో పాటలో అంతకుమించిన రొమాన్స్‌ను ఆవిష్కరించారు. ఈ పాటలో యశ్, బాలీవుడ్ నటి తారా సుతారియా మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాత్‌టబ్‌లో తారా ఎంట్రీ, ఆమెకు యశ్ గన్‌తో ఎంగేజ్‌మెంట్ రింగ్ తొడిగే సీన్, వర్షంలో ఇద్దరి రొమాంటిక్ మూమెంట్స్, కేఫ్‌లో ముద్దులతో సాగే సన్నివేశాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు విశాల్ మిశ్రా, కనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. రెండో పాట విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# 'ఇరుముడి' డబ్బింగ్ ప్రారంభించిన రవితేజ

రవితేజ హీరోగా శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న 'ఇరుముడి' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. తాజాగా ఈ చిత్రానికి రవితేజ డబ్బింగ్ ప్రారంభించారు. షూటింగ్‌లో తన భాగాన్ని పూర్తి చేసిన ఆయన స్టూడియోలో డబ్బింగ్ చెబుతున్న వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. అందులో "నాకు ఒకే ఒక్క కూతురు... ఆమె పేరు మణెమ్మ" అంటూ రవితేజ చెప్పిన డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ వీడియోలో దర్శకుడు శివ నిర్వాణ, బాలనటి నక్షత్ర కూడా కనిపించారు. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. మరో మూడు రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం. మరోవైపు జి.వి. ప్రకాశ్‌కుమార్ రీ-రికార్డింగ్ పనులు కూడా ప్రారంభించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో కూతురిపై అపారమైన ప్రేమ చూపించే తండ్రిగా రవితేజ కనిపించారు. అనూహ్య సంఘటనల తర్వాత మద్యానికి బానిసైన అతడు, కూతురు మాటతో అయ్యప్ప మాల ధరించి జీవితాన్ని మార్చుకునే ప్రయాణం కథలో కీలకంగా ఉండనుంది. రవితేజ కెరీర్‌లో 77వ చిత్రంగా వస్తున్న 'ఇరుముడి'లో భక్తి, భావోద్వేగాలు, కమర్షియల్ అంశాలను సమపాళ్లలో మేళవించినట్లు చిత్రబృందం చెబుతోంది. తండ్రీకూతుళ్ల అనుబంధమే కథకు ప్రధాన బలమని సమాచారం. ఇందులో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురి పాత్రలో కనిపించనుంది. సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, శ్వాసిక కీలక పాత్రలు పోషిస్తున్నారు.

